క్లుప్తంగా

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప కోటిరెడ్డిసర్కిల్ : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్నాటి యల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పచ్చిరొట్ట విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కడప అగ్రికల్చర్ : కడప మండల పరిధిలో పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆధార్ నంబర్ మొబైల్ ఫోన్, పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకుని వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఒక రైతుకు రెండు హెకార్ల వరకు విత్తనాలు ఇస్తామన్నారు. 10 కేజీల ప్యాకెట్ ధర రూ.790 కాగా రైతు వాటా కింద రూ. 395 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే పిల్లపెసర ధర రూ. 970 కాగా రైతు వాటా రూ. 485 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పదిలో ఉర్దూ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులతో కార్పొరేటర్, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి పరీక్షల్లో కడప నగరపాలక బాలుర ఉర్దూ ఉన్నత పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. ఆరుగురు విద్యార్థులు 550 మార్కులు, 11 మంది 500 మార్కులు సాధించినట్లు హెచ్ఎం పుష్పలత తెలిపారు. 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణ విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

నగర వనం వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర వనం వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం సంతకాల సేకరణ చేపడుతున్నట్లు ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రసాద్ తెలిపారు. శనివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప నగర ప్రజల వినోదం కోసం వందల ఎకరాల్లో ఏర్పాటు చేసిన నగర వనం వద్ద సందర్శకులు వాహనాలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలం లేకపోవడం విచాకరమన్నారు. గతంలో నగర వనం వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం ఇచ్చామన్నారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

అవినీతి రహిత సహకార వ్యవస్థ డీసీసీ బ్యాంకు ధ్యేయం



డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్

కడప అగ్రికల్చర్ : అవినీత రహిత సహకార వ్యవస్థ కడప డీసీసీ బ్యాంకు ధ్యేయం అని డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకు బ్రాంచిలలోకానీ, సొసైటీలలోకానీ ఎలాంటి అవినీతిని గమనించినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అవినీతి గురించి తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆకాశరామన్న ఉత్తరాలకు ఎలాంటి ప్రాధాన్యత ఉండదన్నారు. అలాగే ఆధారాలు లేని ఫిర్యాదులపై కూడా ఎలాంటి విచారణ చేపట్టలేమని తెలిపారు. ఎవరైనా ఫిర్యాదు చేయాలనుకుంటే 9966404211 నంబర్‌కు మిస్డ్‌కాల్ చేస్తే తమ వ్యక్తిగత సిబ్బంది స్పందించి వివరాలను సేకరించి విచారణ చేడతారని పేర్కొన్నారు.

హంస వాహనంపై మోక్షనారాయణుడు

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన మోక్షనారాయణుడు హంస వాహనంపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. ఈనెల 3వ తేదీ నుంచి జరుగుతున్న మోక్షనారాయణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఆలయ అవరణలో దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉద్యోగ విజయోత్సవం



ఆఫర్ లెటర్స్ పొందిన విద్యార్థినులతో మేయర్ సురేష్ బాబు, ఆర్‌జేడీ నిర్మల్ కుమార్ తదితరులు

కడప కార్పొరేషన్/కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలో సెంట్రల్ జైలు సమీపంలో ఉన్న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవం(జాబ్ అచీవర్స్ డే) ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కడప మేయర్ కె. సురేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఆఫర్ లెటర్స్ పొందిన వారికి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళా పాలిటెక్నిక్ క్రమశిక్షణకు, నాణ్యమైన విద్యకు మారుపేరుగా నిలుస్తోందన్నారు. గతనెల 29వ తేదీన జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 56 మంది ఎంపికయ్యారన్నారు. వీరిలో 26 మందికి ఆఫర్ లెటర్స్ రావడం అభినందనీయమన్నారు. టెక్నికల్ కాలేజ్ ఆర్‌జేడీ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ తమ విద్యార్థులు సాధించిన గొప్ప విజయాల్లో ఇది కూడా ఒకటన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి, 3వ డివిజన్ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి, కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు అనిత, ఇ. శివ, దామోదరం పాల్గొన్నారు.

హస్తకళల ప్రదర్శన ప్రారంభించిన మేయర్



ప్రదర్శనలో దుస్తులను పరిశీలిస్తున్న మేయర్ సురేష్‌బాబు

కడప కల్చరల్: కడప నగరం శంకరాపురంలోని అపూర్వ కల్యాణ మండపంలో శనివారం నగర మేయర్ సురేష్‌బాబు చేనేత హస్తకళల ప్రదర్శన, అమ్మకాలను ప్రారంభించారు. గ్రామీణ చేనేత అసోసియేషన్ ప్రతినిధులు శేషుబాబు, రాజు, వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ప్రదర్శన ఈనెల 16వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శనలో పోచంపల్లి, మంగళగిరి, వెంకటగిరి, మాధవరం, చీరాల తదతర అన్ని రకాల వస్త్రాలు, గృహ సంబంధిత దుస్తులు, బెడ్‌షీట్లు, వేసవికి అనుగుణమైన వస్త్రాలు లభిస్తాయన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక కొయ్యబొమ్మలు, బ్లాక్ మెటల్, వన్‌గ్రామ్ గోల్డ్, వెండి, ఇత్తడి పూజా సామగ్రి, జూట్ లెదర్ బ్యాగులు, మ్యాజిక్ బొమ్మలు ఇతర వస్తువులు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయన్నారు.

వక్ఫ్ స్థలాల ఆక్రమణలు ఆపండి



వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఇన్సాఫ్ సంస్థ ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో కోట్లాది రూపాయలు విలువజేసే వక్ఫ్ స్థలాలను ఆక్రమణల నుంచి కాపాడాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.షరీఫ్‌లు శనివారం వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్‌ను కోరారు. కడప నగరం వీరస్వామిమండిబజారులోని డోర్‌నెంబరు 21/417లో ఉన్న ముస్లింలకు చెందిన స్మశాన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. సర్వే నెంబరు 14, 15లోని వక్ఫ్‌బోర్డు స్థలంలో ఇటీవల బంకు ఏర్పాటు చేసి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అంజద్‌బాషాను కలిసి ఫిర్యాదు చేయగా, పనులు నిలుపుదల చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. అయినా ఆక్రమణదారులు స్మశాన స్థలాలను వదలడం లేదన్నారు. వక్ఫ్ స్థలాలకు హద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణలు జరగకుండా సూచిక బోర్డులు, ప్రహారీని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ కోశాధికారి గౌస్, నగర అధ్యక్ష, కార్యదర్శులు సాబ్జాన్, మైనుద్దీన్‌లు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. శనివారం పెద్దదర్గా సమీపంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులకు, పాదాచారులకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మజ్జిగ పంపిణీ చేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా యల్లమాంబ కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన రేణుకా యల్లమాంబ కల్యాణం శనివారం వైభవోపేతంగా జరిగింది. తిరునాల సందర్భంగా శనివారం సాయంత్రం జగజ్జనని రేణుకా యల్లమాంబ సమేత జమదగ్ని మహారాజు ఉత్సవమూర్తులకు కల్యాణ మహోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేదపండితులు ఆర్.మల్లికార్జునశర్మ, సుబ్రమణ్యం శర్మ, ప్రదీప్‌శర్మలు అమ్మవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకొని కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పద కవితా పితామహుడు అన్నమయ్య



అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ కో ఆప్షన్ సభ్యుడు బండి బాబు

కడప కార్పొరేషన్ : ప్రముఖ వాగ్గేయకారుడు అన్నమయ్య పద కవితా పితామహుడని మాజీ కో ఆప్షన్ సభ్యుడు బండిబాబు, బండారు సత్య అన్నారు. శనివారం అన్నమయ్య జయంతి సందర్భంగా మున్సిపల్ హైస్కూల్(మెయిన్) ఎదురుగా ఉన్న అన్నమయ్య విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమలేశుని తొలి భక్తుడైన అన్నమయ్య రాసిన భక్తి గీతాలను ఎప్పటికీ మరువలేమన్నారు. వైష్ణవ సాంప్రదాయ దేవతలను కీర్తిస్తూ ఆయన 32వేలకు పైగా కీర్తనలు రచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి. ఈశ్వరయ్య, ఎ. వెంకటేశ్వర్లు, జి. సుబ్బరాయుడు, ఎ. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హరికృష్ణ సేవలు అభినందనీయం



బదిలీపై వెళుతున్న హరికృష్ణను సన్మానిస్తున్న బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం మరియాపురంలోని కెనరా బ్యాంకులో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తూ పదోన్నతిపై వెళుతున్న హరికృష్ణ సేవలు అభినందనీయమని బ్యాంకు మేనేజర్ సింహం రత్నపాల్ తెలిపారు. బెంగళూరు సమీపంలోని తుంకూరు కెనరా బ్యాంకుకు చీఫ్ మేనేజర్‌గా వెళుతున్న హరికృష్ణను శనివారం సాయంత్రం కెనరా బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌లో బ్యాంకు సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల మన్ననలు పొందిన హరికృష్ణను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు లలితారెడ్డి, కుసుమ, వసంత, సునీత, నవిత, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, గోపాల్, కృష్ణారెడ్డి, ఓబులేశు, హరి, మల్లే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శిరిబండి ఉత్సవం



శిడిబండి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న రైతులు

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామ సమీపంలోని కోరుకొండపై వెలసిన బోగాదమ్మ తిరునాల మూడు రోజులుగా కొనసాగుతోంది. శనివారం నిర్వహించిన శిరిబండి ఉత్సవం వైభవంగా సాగింది. అనిమెల, గంగిరెడ్డిపల్లె గ్రామానికి రైతులు తమ ఎద్దులచే శిరిబండిని అమ్మవారిగుడి చుట్టూ మూడు రౌండ్లు తిప్పారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు మండలంలోని ప్రజలు తరలిరాగా వారిలో పురుషులకంటే మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు కటారు శివరామిరెడ్డి సతీమణి రామలక్షుమ్మ రెండు రోజులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శిరిబండి ఉత్సవంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్ఐ రాజారమేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రధాన ధ్యేయంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. వల్లూరు గ్రామ సచివాలయ పరిధిలోని లింగాయపల్లె, దిగువపల్లె సచివాలయ పరిధిలోని అంబవరం గ్రామాల్లో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. అర్హత వుండి ఏవైనా పథకాలు అందకున్నా, ఏవైనా ఇతర సమస్యలు వున్నా తెలపండి పరిష్కరిస్తామని ఆయన ప్రజలను కోరారు. లింగాయపల్లె, అంబవరం గ్రామాల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరారు. అంబవరం గ్రామాన్ని దిగువపల్లె సచివాలయ పరిధిలో చేర్చడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని, స్మశానానికి వెళ్లే దారిలో కల్వర్టు నిర్మించాలని కోరారు. వాటిని మంజూరు చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సర్పంచ్‌లు శ్రీనివాసులురెడ్డి, ఓబుల్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు కిషోర్‌కుమార్, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మురళీరెడ్డి, బాలిరెడ్డి, నారాయణరెడ్డి, లోకేశ్వర రెడ్డి, ఎంపీడీఓ జుబేద, తహసీల్దార్ అమరేశ్వరి, ఈఓపీఆర్‌డీ ప్రసాద్, ఎంఈఓ లిల్లెమ్మ, ఏఈలు పవన్, డానియల్ జోసెఫ్, ఏపీఎం శైలజ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న వృషభాలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో రసవత్తరంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జతల వృషభాలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.50,116లు ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన పగడాలపల్లినాగేష్‌కు చెందిన వృషభాలు గెలుచుకోగా, రెండవ బహుమతి రూ.40,116లు అదే మండలానికి చెందిన ఖాదరాబాద్ నాగసుబ్బారెడ్డికి చెందిన వృషభాలు, మూడవ బహుమతి రూ.30,116లు బద్వేలు మండలం గుంతపల్లెకు చెందిన సుబ్బయ్యకు చెందిన వృషభాలు, నాల్గవ బహుమతి రూ.30,116లు గోపవరం మండలం గోపవరం నెమలయ్యకు చెందిన వృషభాలు, ఐదవ బహుమతి రూ.10,116లు నెల్లూరు జిల్లాకు చెందిన దేవపూజ చౌదరికి చెందిన వృషభాలు గెలుచుకున్నాయి.

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవం

పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా పంచమ వార్షికోత్సవంను 8 వతేదీ నుంచి 10వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9వ తేదీలలో వివిధ పుజలతో పాటు 10వ తేదీ రాత్రి రాష్ట్రస్థాయి తాళాల భజన పోటీలు నిర్వ హిస్తారన్నారు. మొదటి బహుమతి రూ. 20,000 నుంచి మొత్తం 16 బహుమతులు అందజేయబడునని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 9966895195, 6301681657 సంప్రదించాలని తెలిపారు.

ఎమ్మార్సీకి చేరుకున్న పాఠ్య పుస్తకాలు

సిద్దవటం : ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసే పాఠ్య పుస్తకాలు ఎమ్మార్సీకి చేరుకున్నాయని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన వచ్చిన పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు అన్ని సబ్జెక్టులు వచ్చాయన్నారు. 9వ, 10వ తరగతులకు సంబంధించి సీబీఎస్సీ సిలబస్ కావడంతో పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. ఈమేరకు మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు జూన్ నెలలో పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

అన్నదానం మహాదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : అన్నదానం మహాదానమని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ అన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ సమీపంలో శనివారం ఆయన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో తన తండ్రి చల్లా శివరామయ్య జ్ఞాపకార్థం సంవత్సర కాలంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

జీతాల సవరణ ఉత్తర్వులు అమలు చేయాలి



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతి పత్రం సమర్పిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

కడప కార్పొరేషన్ : డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల జీతాల సవరణ ఉత్తర్వులను అమలు చేయాలని ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోషియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ ఎన్. నిరంజన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సందీప్ కుమార్‌లు కోరారు. శనివారం సాయంత్రం డిప్యూటీ సీఎం అంజద్ బాషాకు ఆయన క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా నియామకం జరిగి నాలుగేళ్లుగా తాము గ్రామీణ ప్రాంతాలలో వివిధ వైద్య సేవలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య గ్రామీణ ఆంధ్రప్రదేశ్ ఆశయాన్ని ముందుకు తీసుకుపోవడంలో కీలక భూమిక పోషిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతన సవరణ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు కూడా వర్తింపజేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కో ఆర్డినేటర్ ఎస్. వినోద్ కుమార్, ఉషారాణి, మమత, గౌరి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షలు



వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ విభాగంలోని డిజిటల్ టెక్నిక్స్, డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌లోని యానిమేషన్, ఫొటోగ్రఫీ, పెయింటింగ్, అప్‌లెడ్ ఆర్ట్స్ విభాగాలకు 6వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మార్గదర్శనంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పరీక్షల నియంత్రణ విభాగం పేర్కొంది.

2024లో బీజేపీ పతనం ఖాయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు నజీర్ అహ్మద్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేశంలో 2024లో జరిగే ఎన్నికల్లో బీజేపీ పతనం ఖాయమని కాంగ్రెస్ నాయకులు నజీర్ అహ్మద్, ఏపీ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పఠాన్ మహ్మద్ ఆలీఖాన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరా భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై బీజేపీతో పాటు భజరంగ్‌దళ్ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దేశంలో భజరంగ్ దళ్‌తో పాటు ఆర్ఎస్ఎస్‌ను వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం మోదీ ప్రభుత్వం మత, కుల విద్వేషాలు సృష్టిస్తూ ముస్లిం, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాలపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నాగరాజు, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మండలానికి జీలుగలు మంజూరు



జీలుగలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి, ఎంపీపీ

చెన్నూరు : మండలానికి 183 క్వింటాలు జిలగలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు ఎర్రసాని మోహన్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్‌లు తెలిపారు, ఈ సందర్భంగా వారు చెన్నూరు-1 రైతు భరోసా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 2023 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 183 క్వింటాళ్ల జీలగలు వచ్చాయని తెలిపారు. ఇవి రైతులకు సబ్సిడీతో ఇవ్వడం జరుగుతుందన్నారు. కిలో జీలుగలు ధర రూ.79 ఉండగా, ఇందులో రైతు వాటా రూ.39.50 ఉంటుందన్నారు. రామనపల్లెకు 50 కింటాళ్లు, చెన్నూరు-3కు 12 క్వింటాళ్లు, చెన్నూరు-1కు 20 క్వింటాళ్లు, ఉప్పరపల్లెకు 20 క్వింటాళ్లు, గుర్రంపాడుకు 50 క్వింటాళ్లు, కనపర్తికి 6 క్వింటాళ్లు, శివాలపల్లికి 5 కింటాళ్లు, బయనపల్లెకి 20 క్వింటాళ్లు ఇవ్వడం జరిగిందన్నారు, రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌తో రైతు భరోసా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకుని జీలుగలు తీసుకు వెళ్లాలని కోరారు. ఎకరాకు 10 కేజీల చొప్పున జీలగలు పంపిణీ చేస్తామన్నారు.